క్లుప్తంగా

దత్తపీఠంలో బోనాల వేడుక



మక్తల్: మండలంలోని వల్లభాపురం దత్త పీఠంలో రేణుక మాతకు మంగళవారం బోనాలను సమర్పించారు.శివరాత్రి ముగింపు సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో దత్తస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ వనజ, సర్పంచ్ దత్తు, విఠలనంద తదితరులు పాల్గొన్నారు.

వానపాముల చోరీ

మక్తల్: కాట్రేవ్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన డంపింగ్ యార్డుల్లో ఎరువు తయారు చేస్తున్న క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వానపాములు చోరీ చేస్తున్నారని సర్పంచ్ లక్ష్మి, కార్యదర్శి రమేష్‌లు మంగళవారం విలేకర్లకు తెలిపారు. డంపిగ్ యార్డుల్లో ఉన్న వానపాములను భూత్పూర్ రిజర్వాయర్‌లో చేపలకు ఎర వేసేందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. అదేవిధంగా రాత్రి సమయంలో కొందరు అక్కడ మద్యం సేవించి సీసాలు పగులగొడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

లారీ ఢీ : మహిళకు తీవ్రగాయాలు

మరికల్: లారీ ఢీకొనడంతో మహిళ గాయపడిన ఘటనిది. వివరాల్లోకి వెళ్తే.. మరికల్‌లో తెల్లవారుజామున ఇనుములోడుతో హైదరాబాద్ నుంచి రాయిచూర్ వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి పడమటి ఆంజనేయస్వామి ఆలయ ముందుభాగాన్ని ఢీ కొట్టుకుంటూ హోటల్‌లో పనులు చేయడానికి వెళ్తున్న తిరుపతమ్మను ఢీ కొంది. అదుపు తప్పిన లారీ బారికేడ్లను తొక్కుకుంటూ అలాగే రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి వెళ్లింది. ప్రమాదంలో తిరుపతమ్మకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో అంబులెన్స్‌లో ఆమెను ఈ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

నట్టల నివారణకు చర్యలు

నర్వ: మండలంలోని పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత నట్టల నివారణ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమవుతుందని వైద్యులు అశోక్ తెలిపారు. 22న, రాయికోడ్, కుమార్‌లింగంపల్లి, పెద్దకడ్మూర్, 23న, లంకాల్, ఎల్లంపల్లి, లక్కర్‌దొడ్డి, 24న, రాంపూర్ బెక్కర్‌పల్లి, యాంకి, 25న, నర్వ, కొత్తపల్లి, కల్వాల్, 27న, జక్కన్నపల్లి, పాథర్చేడ్, ఉందేకోడ్, 28న, రాజుపల్లి,జంగంరెడ్డిపల్లి, సీపూర్‌లలో ఉచిత నట్టల నివారణ నిర్వహిస్తున్నామన్నారు.

ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



నారాయణపేట రూరల్ : గ్రామీణ ప్రజల ఆరాధ్యదైవమైన ఎల్లమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోనే అత్యంత ప్రత్యేక కల్గిన లింగంపల్లి గ్రామంలో నాల్గవ మంగళవారం భక్తులతో జనసంద్రంగా మరింది. శివరాత్రి ముగియడంతో శివమాల తీసిన భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనానికి పోటేత్తారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకం

ఆత్మకూర్: పట్టణంలోని మదర్సా ఇమాదుల్ ఉలూం 22వ వార్షికోత్సవం మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా మహ్మద్ ప్రవక్త దివ్య సూక్తులను తెలంగాణ, ఆంధ్ర అరబిక్ స్కూల్స్ అధ్యక్షుడు మౌలానా జమాలుర్ రహ్మాన్, మౌలాన అహ్మద్‌వమీజ్‌సాహెబ్, మౌలానా జుబేర్‌అహ్మద్‌ఖాన్, ప్రముఖ మౌలానాలు, ప్రసంగీకులు దైవ సందేశమిచ్చారు. దివ్యఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని పఠనం చేయాలని సూచించారు.

గుండెపోటుతో రిటైర్డ్ తహసీల్దార్ మృతి

నారాయణపేట రూరల్ : ఇటీవల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న తహసీల్దార్ షర్ఫోద్దీన్ గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు... పట్టణానికి చెందిన ఆయన 25 ఏళ్ల క్రితం జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. అదే క్యాడర్‌లో ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతుండటంతో గత నెలలో వాలంటరీ రిటైర్మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం కొంత నలతగా ఉందని చెప్పడంతో సోదరులు ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు. రాత్రి ఇంట్లో భోజనం చేసి కాలకృత్యాలకు వెళ్ళి అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. షర్ఫోద్దీన్‌కు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. ఆయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

నత్తనడకన రోడ్డు విస్తరణ

- పూడుకుపోయిన డ్రైయినేజీ వ్యవస్థ
- రోడ్డుపై పారుతున్న నీరు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- త్వరగా పూర్తిచేయాలంటున్న ప్రజలు



రోడ్డు పై పారుతున్న మురుగునీరు



రోడ్డు విస్తరణకు ఇళ్ల కూల్చివేత

దామరగిద్ద: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారాయి. విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చేందుకు ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో పాటు రోడ్డుకు అదనపు నిధులు మంజూరు చేయించినా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం లేదు. ఏడేళ్ల కిత్రం దామరగిద్ద- యానగుంది వరకు 11.5 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవతో రూ.13 కోట్ల నిధులు మంజూరు చేశారు. కాగా దామరగిద్ద గ్రామంలో మినహా మిగిలిన 10.08 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పూర్తి చేశారు. ఇక్కడి సంజీవరాయ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ వరకు రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు ఉండటంతో ఇన్నాళ్లుగా 700 మీటర్ల రహదారి విస్తరణ పెండింగ్‌లో ఉండిపోయింది. అయితే వారికి పరిహారంగా ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. రాతపూర్వక హామీతో స్థానికులు స్వచ్ఛందంగా వదులుకోగా ఇళ్లు కూల్చివేశారు. కానీ పనులు ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో గతంలో ఉన్న మురుగు కాల్వలు పూడిపోయి నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో అధికారులు ఇళ్లు కూల్చడంపై పెట్టిన శ్రద్ధ పనులు చేయించడంపై పెట్టడం లేదని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయించాలని అంటున్నారు.

రెండురోజుల్లో ప్రారంభిస్తాం

గ్రామస్తులు స్థానిక ప్రజా ప్రతినిధుల చొరవతో విస్తరణ లో భాగంగా ఇళ్లు కూల్చివేశాం. పనులు రెండు రోజుల్లో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. పెండింగ్ బిల్లులు రాగానే ప నులు ప్రా రంభిస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. మురుగు కాల్వల నిర్మాణం పరిధిలో లేదు, కా ల్వలు నిర్మించినా లేకున్నా పనులు ప్రారంభిస్తాం. **–రాములు,** డీఈ, ఆర్అండ్‌బీ, నారాయణపేట

ఇంటర్నల్ మార్కుల నమోదుపై తనిఖీ



మాగనూర్ ఉపాధ్యాయులతో జీహెచ్ఎం

మాగనూర్: పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇంటర్నల్ మార్కుల నమోదుపై మంగళవారం మండల పరిధిలోని నేరడగం, మాగనూర్, వడ్వాట్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో జీహెచ్ఎం రాజేందర్ తనిఖీ నిర్వహించారు. మార్కుల తీరును పరిశీలించారు. అనంతరం నివేదిక ఉన్నత కమిటీకి సమర్పించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాతే ఇంటర్నల్ మార్కులను ఎస్సెస్సీ బోర్డు వెబ్‌సైట్‌లో నమోదుకు వెసులుబాటు ఉంటుదని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నర్సిములు, శ్రీనివాసురావు, రామోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జములమ్మ జాతర



నైవేద్యాలు సిద్ధం చేస్తున్న భక్తులు

ధన్వాడ: మండల కేంద్రంలోని కంచుకోట వీధిలో ఉన్న జములమ్మ దేవాలయంలో 4వ వారం జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. లింగంపల్లి ఎల్లమ్మ జాతరను పురస్కరించుకొని 5 వారాల పాటు ప్రతి మంగళవారం జములమ్మను భక్తులు కొలుస్తారు. ఉదయం భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



శంకరానంద సరస్వతి ఆలయం



స్వామివారి రథం

కృష్ణా: మండలంలోని హిందూపూర్ గ్రామంలో బుధవారం నుంచి శ్రీ శంకరానంద సరస్వతి మహాస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆ మఠం సభ్యులు తెలిపారు. మంగళవారం మఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గురువారం ఉదయం కాకడ హారతి, ధ్వజారోహణ, మధ్యాహ్నం గీతాపారాయణం, సాయంత్రం ప్రభోత్సవం ఉంటుందని, రాత్రి భజన కార్యక్రమం ఉంటుదని అన్నారు. శుక్రవారం ఉదయం మఠంలో రుద్రాభిషేకం, మహా మంగళ హారతి, తొట్లపూజ, సాయంత్రం రథోత్సవం ఉటుందని అన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మాతృభాష కన్నతల్లి లాంటిది



కోటకొండలో సన్మానం అందుకుంటున్న తెలుగు ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్ : మాతృభాషా దినోత్సవ వేడుకలను మంగళవారం మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షులు శేర్ కృష్ణారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి. టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రెడ్డప్పలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్ని భాషలను నేర్చుకున్న కన్నతల్లిలాంటి మాతృ భాషను విస్మరించరాదని, చిన్నచూపు చూడరాదన్నారు. కోటకొండ, బసిరెడ్డిపల్లి, అభంగాపూర్, కొల్లంపల్లి, బొమ్మన్‌పాడు తదితర పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతిక పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు.

ఉపాధ్యాయులైన చిన్నారులు



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

మాగనూర్: దేశభవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకొంటుందని ఉజ్జేల్లి మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా అన్నారు. మంగళవారం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. కలెక్టర్‌గా ప్రసాద్, డీఈఓగా కావేరి, ఎంఈఓగా ఫాతిమా, ప్రధానోపాధ్యాయులుగా పావని, మరికొందరు చిన్నారులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. సర్పంచ్ లక్ష్మమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ నర్సింగప్ప, ఈశ్వర్‌యాదవ్, ఉపాధ్యాయులు భవ్యశ్రీ, అరుణ, మహేష్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

వలస కూలీల పిల్లలకు విద్య అందించాలి

మరికల్: వివిధ రాష్ట్రాల నుంచి ఇటుక బట్టీల వద్దకు కుటుంబాలతో పాటు వలసలు వచ్చిన చిన్నారులకు విద్యను అందించేందుకు కృషిచేయాలని ఎంఈఓ అంజలీదేవి అన్నారు. ఇటుక బట్టీల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. బడి బయట పిల్లల గుర్తింపుల్లో భాగంగా మంగళవారం మరికల్ మండలంలోని ఇటుక బట్టీల దగ్గర ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు ఆయా రాష్ట్రాల ఉపాధ్యాయులను నియమించి విద్యను అందించాలని సూచించారు. లేనిచో చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలను పనుల్లో పెట్టుకోరాదని హెచ్చరించారు. సీఆర్పీలు ప్రవీణ్‌కుమార్, శివకుమార్, రాఘవేందర్, అరుణ పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం : కేసు నమోదు

కోస్గి: మండల పరిధిలోని చెన్నారంలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటనిది. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన లక్ష్మప్ప కుమారుడు నరేందర్(10) శివారులోని పాఠశాలలో 4 తరగతి చదువుతున్నాడు. ఈ నెల 17న ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లిన అతడు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో 5 రోజులుగా బాధిత కుటుంబ సభ్యులు బంధువుల దగ్గర, ఇతర చోట్ల వాకాబు చేశారు. ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యంగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ధ్యానంతో ఏకాగ్రత



కోస్గి: ప్రతి మనిషి వయసుతో సంబంధం లేకుండా ప్రతిరోజు 15 నిమిషాల పాటు శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచుకోవచ్చునని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రచారకర్తలు ఆంజనేయరెడ్డి, బాలకృష్ణారెడ్డిలు సూచించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి, గుండ్లపల్లి గ్రామాల్లో విద్యార్థులకు, గ్రామస్తులకు ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచి ధ్యానం అలవాటు చేసుకోవడం ద్వారా ఉన్న వ్యాధులు దరిచేరవన్నారు.అనంతరం ధ్యానం చేసే విధానాన్ని సమగ్రంగా వివరించారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'



నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయులకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే ఏకైక సంఘం పీఆర్‌టీయూ మాత్రమేనని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాద్గీర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోటకొండ, బొమ్మన్‌పాడు ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండలిలో తన వాణిని వినిపించి ప్రభుత్వంతో ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ అభివృద్ధికి కృషిచేస్తారని చెప్పారు. 317జీఓ ద్వారా ఇబ్బందులు పడుతున్న టీచర్ల సమస్యలు విడుతల వారీగా పరిష్కరిస్తున్నారని, కోర్టు కేసుల పరిష్కారం అనంతరం పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్ పూర్తి అవుతుందని, పీఎస్ హెచ్‌ఎంల పోస్టుల భర్తీ జరుగుతుందని, సీపీఎస్ రద్దుకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, విశ్వనాథ్, రఘువీర్, మొల్గాన్ జనార్దన్, రవికుమార్, నర్సింగ్ పాల్గొన్నారు.

పాలవ్యాన్, కారు ఢీ

నారాయణపేట రూరల్ : పాలవ్యాన్, కారు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనిది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సమయంలో మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేటకు పాల ప్యాకెట్లతో వస్తున్న వ్యాన్, అదే సమయంలో నారాయణపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కారు అప్పక్‌పల్లి – చిన్నజట్రం మధ్యలో కల్వర్టు దగ్గర ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్నాయి. వ్యాన్‌లోని పాల ప్యాకెట్లు రోడ్డుపై పడిపోగా, ఇరు వాహనాల్లోని వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా ప్రహరీ పనులు

మక్తల్: కాట్రేవ్‌పల్లి యూపీఎస్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రహరి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గోడ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు అయ్యాయి. సర్పంచ్ లక్ష్మి పనులను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాఠశాల్లో జరిగే పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించి సందర్శిస్తున్నారు.

'ఆయిల్ పాం'కు దరఖాస్తు చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ అపర్ణ

మాగనూర్: రైతులు ఆయిల్ పాం సాగుపై ఆసక్తి ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కొత్తపల్లి ఏఈఓ అపర్ణ అన్నారు. మంగళవారం ఆమె గ్రామంలోని రైతులకు శ్రీ అంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో అవగహన కార్యక్రమం నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక ఆయిల్ పాం మొక్క ఖరీదు రూ.193 ఉండగా రైతులు కేవలం రూ. 20 చెల్లిస్తే చాలని తెలిపారు. మిగిలిన రాయితీ మొత్తం ప్రభుత్వం భరిస్తుందని సూచించారు. ఏకరానికి 57 మొక్కలు అవసరం అవుతాయని , నాలుగు సంవత్సరాల వరకు తోట నిర్వాహణ ఖర్చు కూడా ఇస్తామన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీలకు 90శాతం, ఐదు ఎకరాలలోపు ఉన్న ఓసీ రైతులకు 90 శాతం అంతకన్న ఎక్కువగా ఉంటే 80శాతం సబ్సీడీపై డ్రిప్ ఇరిగేషన్ ఇస్తుందని అన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ తిమ్మప్ప, ఎంపీటీసీ బంగి లక్ష్మి, ఉపసర్పంచ్ అంజమ్మ , గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా' అక్రమాలపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న భాస్కర్

ఊట్కూర్: గ్రామంలో ఆసరా పింఛన్‌లలో జరిగిన అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఊట్కూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామంలో సుమారు 1750 ఆసరా పించన్లు మంజూరు చేస్తున్నారని, వాటిలో 60కి పైగా మృతి చెందిన వారిని బతికి ఉన్నట్లు చూపి తీసుకుంటున్నవే ఉన్నాయని ఆరోపించారు. పోస్టల్ సిబ్బందితో కుమ్మక్కై డబ్బులు డ్రా చేసుకుంటున్నారని అన్నారు. 3 ఏళ్లుగా తంతు కొనసాగుతుందని సుమారు రూ. 25 లక్షల వరకు అక్రమాలు జరిగి ఉంటాయని తెలిపారు. ఎంపీడీఓకు పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఊట్కూర్‌లో ఉపాధిహామీ పథకంలోనూ అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. హరితహారంలో మొక్కలు నాటినట్లు, ట్రాక్టర్ల ద్వారా నీరుపోసినట్లు డబ్బులు డ్రా చేసుకున్నారని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ హన్మంతు, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు భరత్, వాణిజ్య సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య గౌడ్, వార్డు సభ్యులు రఘువీర్, నాయకులు కుర్వ ఆశప్ప, కొండన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సర్వే మొదలు



సర్వేలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

మాగనూర్: మండల కేంద్రంలోని పాత రోడ్లపై అధికారుల పర్యవేక్షణ లోపంతో 100 ఫీట్ల రోడ్డు కాస్తా కబ్జాలకు గురైందంటూ గ్రామస్తులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో మంగళవారం మండల రెవెన్యూ అధికారులు రోడ్డు సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని మైసమ్మవ్వ దగ్గర నుంచి పుకటినగర్ కాలనీ వరకు గల పురాతన రహదారిని సర్వే నిర్వహిస్తున్నాట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతానికి రోడ్డును సర్వే చేసి రిపోర్టును సంబంధిత అధికారులకు సమర్పిస్తామని తదుపరి ఆదేశాలనుసారం చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలం, సర్వేయర్ జయశంకర్, వీఆర్ఏలు సందీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు కనిపించడం లేదా?'



మురుగునీరును చూపిస్తున్న నాయకులు

ధన్వాడ: పేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తక్షణమే కంటి వెలుగు పరీక్షలు చేసుకోవాలని అప్పుడైనా ఎక్కడ సమస్యలు ఉన్నాయో, అభివృద్ధి ఎక్కడ జరిగిందో కనిపిస్తుందని బీఎస్పీ నియోజకర్గ ఇన్‌చార్జ్ బొదిగెల శ్రీనివాస్ విమర్శించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలేదని వాపోయారు. పాఠశాల పక్కనే చిన్నపాటి చెరువులా మురుగు నీరు నిలిచి ఉందని, దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని అన్నారు. దోమలబెడద పెరిగి రాత్రి సమయంలో విద్యార్థులు నిద్రించలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తాగటానికి మంచి నీళ్లు కూడా దొరకని పరిస్థితి రావడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్తారన్నారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే కస్తూర్బా వసతి గృహాన్ని సందర్శించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇందులో చంద్రయ్య, వెంకటేష్, రవియాదవ్, గుర్రం రాజు, జడల బాల్‌రాజు, తిరుమలేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



నర్వలో పోటీలను ప్రారంభిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

నర్వ: మండల కేంద్రంలో నర్వ ప్రీమీయం క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచు పెద్దింటి సంధ్య, ఎంపీపీ జయరాములుశెట్టి, వైస్ ఎంపీపీ వీణావతిలు పాల్గొన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి శ్రీహరీ, నియోజకవర్గ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్‌లు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం యువకులతో ఉత్సాహంగా కాసేపు ఆటవిడుపుగా క్రికెట్ ఆడారు. అనంతరం మాట్లాడుతూ.. క్రికెట్‌లోనూ యువకులు రాణిస్తే గుర్తింపు పొందవచ్చన్నారు. ఈ పోటీల్లో 10 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఎం.రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు కుర్మారెడ్డి, కృష్ణారెడ్డి, లంకాల రవికుమార్, వివేక్‌వర్ధన్‌రెడ్డి, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడతాం



ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూరు: గ్రామాల అభివృద్ధికి పాటుపడతామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నపొర్ల గ్రామాన్ని సందర్శించారు. గ్రామపెద్దలతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు వీధుల్లో సీసీ రోడ్లు లేవని, నిధులు మంజూరు చేయాలని కోరగా రూ.20 లక్షల ప్రత్యేక నిధులు తన కోటా నుంచి మంజూరు చేస్తానని, సీసీ రోడ్లు నాణ్యతతో చేపట్టాలని తెలిపారు. 15 రోజుల క్రితం తన నిధుల నుంచి పెద్దపొర్ల గ్రామానికి వెళ్లే రహదారిలో సీసీ రోడ్లు వేయించారాన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధికి పాటుపడాలని గ్రామపెద్దలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టెం సూచించారు. అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవిప్రసాద్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరవింద్‌కుమార్, రైతు బంధు మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షులు అనిల్‌రెడ్డి, ఇర్షాద్, అర్పాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.